# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 304 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం ● 14, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




చేవెళ్ల పార్లమెంట్‌లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్..

3లో...

# ప్రశాంతంగా పోలింగ్

- రాష్ట్రంలో 64 శాతం దాటిన ఓటింగ్.. 2019 కంటే అధికం
- అనుకూలించిన వాతావరణం.. 1,400 కేంద్రాల్లో రాత్రిదాకా..
- ఖమ్మంలో అత్యధికం.. హైదరాబాద్‌లో అత్యల్పం
- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల బారులు
- సాయంత్రం 6 గంటల తర్వాత కూడా క్యూలైన్లు
- ఓటుహక్కును వినియోగించుకున్న ప్రముఖులు
- పలుచోట్ల ఓటర్ల నిరసన.. ఈవీఎంల మొరాయింపు
- కాంగ్రెస్, బీజేపీ నేతల ప్రలోభాలు.. కేసులు నమోదు
- రాష్ట్రవ్యాప్తంగా ఒక్కరోజే 38 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు
- ఎక్కడా రీ పోలింగ్ అవసరం లేదు: వికాస్‌రాజ్
- ఓటేసేందుకు వెళ్లి ముగ్గురు.. విధుల్లో ఇద్దరు మృతి



**హైదరాబాద్, మే 13 (నమస్తే ఉదయం):** రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అక్కడక్కడ చిన్నచిన్న సంఘటనలు మినహా ఎక్కడా ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకపోవడంతో పోలింగ్ యంత్రాంగం ఊపిరిపీల్చుకున్నది. రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో సోమవారం ఉదయం 7 గంటలకే ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,400 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న వారందరికీ రాత్రి పొద్దుపోయే వరకు ఓటు వేసే అవకాశం కల్పించారు. రాత్రి 11 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 64.02% ఓటింగ్ జరిగినట్టు ఎన్నికల సంఘం ప్రాథమికంగా అంచనా వేసింది. తుది లెక్కలు వచ్చిన తరువాత ఈ శాతం మరికొంత పెరిగే అవకాశం ఉన్నది. హైదరాబాద్ నియోజకవర్గంలో అతి తక్కువగా 44.91% పోలింగ్ నమోదు కాగా, సికింద్రాబాద్‌లో 47.49% నమోదైంది.

ఖమ్మంలో అత్యధికంగా 75.19% ఓటింగ్ నమోదైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 62.77% ఓటింగ్ నమోదు కాగా, ఈసారి దానిని అధిగమించడం విశేషం. ఈ సంవత్సరం ఎండలు తీవ్రంగా ఉండటంతో పోలింగ్‌పై ప్రభావం చూపుతుందనే ఉద్దేశంతో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయం పొడిగించారు. అయితే, వాతావరణం అనూహ్యంగా చల్లబడటంతో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉంటుందన్న అంచనాతో ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. దీంతో ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున క్యూలైన్లు దర్శనమిచ్చాయి. అయితే, సాయంత్రం వరకు కూడా సాధారణ ఎండలు మాత్రమే ఉండటంతో ఓటింగ్ శాతం పెరిగిందని విశ్లేషిస్తున్నారు.

హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ సహా ఉత్తరాది రాష్ట్రాలకు లక్షలాది మంది తరలివెళ్లినా పోలింగ్ శాతం పెరగడం అభ్యర్థులను, రాజకీయ పార్టీలు, ఎన్నికల సంఘం అధికారులకు ఊరటనిచ్చింది. హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాధవీలత, నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్, జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిపై కేసులతోపాటుగా మొత్తం 38 ఎఫ్‌ఐఆర్‌లు సోమవారం ఒక్కరోజే నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 115 ఈవీఎంలు వివిధ కారణాలతో మొరాయించడంతో వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటుచేశారు. పోలింగ్ రోజు సోమవారం ఎన్నికల అక్రమాలపై సీ-విజిల్ యాప్‌కు 225 ఫిర్యాదులు, డయల్ 1950 ద్వారా 21 ఫిర్యాదులు మిగతా.. 2లో

## ఎవరి ధీమా వారిదే!

- 10-12 సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ అంచనా.. ముస్లిముల ఏకపక్ష పోలింగ్‌పై భరోసా
- పోల్ మేనేజ్‌మెంట్లో ముందున్నామని విశ్లేషణ
- 9-10 గెలుస్తామంటున్న బీజేపీ వర్గాలు
- మోదీ క్రేజ్ గ్రామాల్లోనూ ఉందని విశ్వాసం
- ఆరు గెలుచుకుంటామని బీఆర్ఎస్ అంచనా



**హైదరాబాద్, మే 13 (నమస్తే ఉదయం):** రాష్ట్రంలో లోక్‌సభ పోలింగ్ ముగిసింది. నువ్వా నేనా అన్నట్లు సాగిన త్రిముఖ పోరులో విజయం ఎవరిదనే చర్చ అన్ని పార్టీల్లో మొదలైంది. మూడు పార్టీలూ ఫలితాల పట్ల ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అత్యధిక స్థానాలు గెలుచుకుంటామని, గత నవంబరు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అదృష్టం కాదని నిరూపిస్తామని కాంగ్రెస్ ధీమాగా చెబుతోంది. సోమవారం సొంత గ్రామంలో ఓటేసిన సందర్భంగా కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికల ఫలితాలు తమ ప్రభుత్వ మిగతా.. 2లో



# 4వ దశలో 67% ఓటింగ్

- దేశవ్యాప్తంగా 96 స్థానాలకు పోలింగ్
- తెలంగాణలో 64.74 శాతం
- శ్రీనగర్‌లో 38%.. దశాబ్దాల్లో అత్యధికం
- బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు
- ఇప్పటిదాకా 379 స్థానాల్లో ఎన్నికలు
- ప్రజల మద్దతు తమకేనన్న విషయం

**న్యూఢిల్లీ, మే 13 (నమస్తే ఉదయం):** సార్వత్రిక ఎన్నికల సమరం నాలుగో దశలో 67.25 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం రాత్రి 11.45 గంటల వరకూ అందిన సమాచారం ప్రకారం.. 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 96 స్థానాల్లో ఈ మేరకు పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఏపీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈసీ వెల్లడించిన వివరాలను బట్టి.. ఆ సమయానికి ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ 76.5 శాతంగా, తెలంగాణలో 64.74 శాతంగా ఉంది. ఏపీ (25), తెలంగాణ(17)లోని మొత్తం ఎంపీ స్థానాలతో పాటు యూపీ (13), మహారాష్ట్ర (11), పశ్చిమబెంగాల్ (8), మధ్యప్రదేశ్ (8), బిహార్ (5), ఝార?ండ్ (4), ఒడిశా (4), జమ్మూకశ్మీర్ (1)లోని పార్లమెంటు స్థానాలకు సోమవారం ఎన్నికలు జరిగాయి. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి ఈ 96 స్థానాల్లో.. ఈవీఎంల మొరాయింపు, ఏజెంట్ల అడ్డగింత వంటి 1700 ఫిర్యాదులు నమోదయ్యాయి. పశ్చిమబెంగాల్‌లో 8 స్థానాల్లో టీఎంసీ, కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య చెలరేగిన ఘర్షణల నేపథ్యంలో మూడు పార్టీలూ పరస్పరం వందలాది ఫిర్యాదులు చేసుకున్నాయి. మొత్తం ఏడు దశల్లో ఈసీ ఈ ఎన్నికలను నిర్వహిస్తుండగా.. తాజాగా పూర్తయిన నాలుగో దశతో దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 379 స్థానాల్లో పోలింగ్ ముగిసినట్టయింది.

అలాగే.. ఏపీ, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాలన్నింటికీ, ఒడిశాలో 28 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు ముగిశాయి. కడపటి వార్తలు అందే సమయానికి వీటిలో పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 78.37 శాతం పోలింగ్ నమోదు కాగా.. శ్రీనగర్ నియోజకవర్గంలో అతి తక్కువగా 37.98 శాతం ఓటింగ్ నమోదైంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న ఈ తొలి ఎన్నికల్లో 38 శాతం అంటే మనకు తక్కువ అనిపించవచ్చుగానీ.. గత కొన్ని దశాబ్దాల్లో ఇదే అక్కడ అత్యధికం అని ఈసీ ప్రకటించడం గమనార్హం. నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా, ఆయన కుమారుడు, పార్టీ ఉపాధ్యక్షుడు ఓమర్ అబ్దుల్లా.. ఆయన కుమారులు జమీర్, జహీర్ అబ్దుల్లా.. ఇలా అబ్దుల్లాకుటుంబానికి చెందిన మూడు తరాల వారు తమ ఓటు హక్కును శ్రీనగర్‌లో మిగతా.. 2లో



## వందరోజుల పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండం

- ఇండియా కూటమి విజయం సాధిస్తోంది
- 75 ఏళ్ల మోడీకి పదవి ఎలా ఇస్తారు
- మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కొడంగల్,మే13 (నమస్తే ఉదయం):** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 33.5 శాతం ఓట్లు వచ్చాయని.. ఈ ఎన్నికల్లో అంతకు మించివస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు తమ వందరోజుల పాలనకు రెఫరెండమని తెలిపారు. బీజేపీ కూడా ఈ ఎన్నికలు మోదీ పాలనకు రెఫరెండం అని చెబుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొడంగల్‌లో కుటుంబసమేతంగా సీఎం రేవంత్ ఓటేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..

అసెప్టెంబర్ 17, 2025తో మోదీ 75 ఏళ్లు నిండుతాయని.. ఏజ్ లిమిట్ అమలు చేస్తే ఎవరు ప్రధాని అనేది బీజేపీ తేల్చుకోవాలని హితవుపలికారు. దేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని స్పష్టం చేశారు. మ్యాజిక్ ఫిగర్ రాకపోతే బీజేపీ, ఎన్డీఏకు దేశంలో మద్దతు ఇవ్వడానికి ఎవరూ సిద్ధంగా లేరని సీఎం వెల్లడించారు. బీజేపీ 336 సీట్లలో మాత్రమే పోటీ చేస్తోందని.. 400 సీట్లు ఎట్లా సాధ్యమని ప్రశ్నించారు. 13 ఏళ్లు సీఎంగా, 10 ఏళ్లు పీఎంగా పని చేసిన మోదీ.. భారత రాజ్యాంగాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదని విమర్శించారు. దేశంలో మతపరమైన రిజర్వేషన్లు లేవన్నారు. సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే దేశంలో రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఏపీలో ఎన్డీఏ కూటమి ఎందుకు చెప్పడంలేదని నిలదీశారు. దేశ ప్రజలకు మోదీ మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు. ఇండియా కూటమి పేరుతో తాము ప్రజలను ఓట్లు మిగతా.. 2లో

## నేడు వారణాసిలో ప్రధాని మోడీ నామినేషన్

**కాశీ వీధుల్లో మోడీ భారీ రోడ్‌షో - హాజరైన సిఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు**



**వారణాసి,మే13 (నమస్తే ఉదయం):** ఉత్తర్ ప్రదేశ్‌లోని వారణాసి నియోజకవర్గం నుంచి మూడోసారి పోటీ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం సాయంత్రం నగరంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షో ప్రారంభించడానికి ముందు లంక ప్రాంతంలోని మాలవ్య చౌరస్తా వద్ద ఉన్న విద్యావేత్త, సంఘ సంస్కర్త మదన్ మోహన్ మాలవ్య విగ్రహానికి ప్రధాని మోడీ పూలమాల వేసి నివాళులర్పించారు. మంగళవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్న ప్రధాని మోడీ వెంట ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రోడ్‌షోలో పాల్గొన్నారు. 7వ దశ లోక్‌సభ ఎన్నికలలో జూన్ 1న వారణాసి స్థానానికి పోలింగ్ జరగనున్నది. ప్రధాని మోడీ వరుసగా మూడవ పర్యాయం ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. మాత్రాశక్తికి ప్రతిరూపంగా కాషాయ రంగు వస్త్రాలు ధరించి మహిళలు పెద్ద సంఖ్యలో మోడీ మిగతా.. 2లో

## ప్రశాంతంగా తెలంగాణ పోలింగ్

- భద్రత మధ్య ఇవిఎంల తరలింపు
- పూర్తిస్థాయి ఓటింగ్ శాతం నేడు ప్రకటన
- సిఇవో వికాస్ రాజ్ వెల్లడి



**హైదరాబాద్,మే13 (నమస్తే ఉదయం):** తెలంగాణలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగాయని రాష్ట్ర ఎన్నికల అధికారి(సీఈవో) వికాస్ రాజ్ వెల్లడించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తలేదన్నారు. మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా వచ్చారని పేర్కొన్నారు. ఇంకా 13, 14 వందల పోలింగ్ స్టేషన్లో ఇంకా పోలింగ్ నడుస్తోందని తెలిపారు. ఉదయం నుంచి పోలింగ్ మంచిగా జరిగిందన్నారు. తెలంగాణలో సాయంత్రం 5 గంటల వరకు 61.16 శాతం పోలింగ్ నమోదైందని.. అత్యధికంగా మెదక్‌లో 71.33 శాతం పోలింగ్ నమోదు కాగా.. అత్యల్పంగా హైదరాబాద్‌లో 39.17 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు. కేంద్ర ఆధ్వర్యంలో ఉండే యాప్‌లలో 415 ఫిర్యాదులు రాగా.. వేర్వేరు ప్రాంతాల్లో 38 ఎఫ్‌ఐఆర్‌లు నమోద య్యాయన్నారు. 225 ఫిర్యాదులు మిగతా.. 2లో

## ఓటింగ్ కేంద్రాల వద్ద సెల్ఫీపాయింట్

- ఇసి నిర్ణయంతో సత్ఫలితాలు

**హైదరాబాద్,మే13 (నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. ఓటు వేసేందుకు వయోజనులు ఉదయమే పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. ప్రతి ఒక్కరు ఓటు వేయాలని ఎన్నికల సంఘం ప్రజలకు పిలుపునిచ్చింది. ఓటు హక్కు విధిగా ఉపయోగించుకోవాలని సెలబ్రిటీలు కోరారు. ఈ సారి పోలింగ్ కేంద్రాల వద్ద సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. జనాలు సెల్ఫీ అంటే ఇంట్రెస్ట్ చూపించడంతో వారి అభీష్టం మేరకు సెల్ఫీ పాయింట్ నెలకొల్పారు. దీంతో కొందరు ఓటు అంటే ఇంట్రెస్ట్ చూపని వారు కూడా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేస్తున్నారు. ఓటు వేసిన తర్వాత సెల్ఫీ దిగుతున్నారు. ఆ పిక్స్ వాట్సాప్ స్టేటస్, వాట్సాప్ గ్రూపులు, ఫేస్ బుక్, ఎక్స్‌లో షేర్ చేస్తున్నారు. మేము ఓటేశాం.. మరి మీరు అని ఫ్రెండ్స్‌ను అడుగుతున్నారు. ఓటు హక్కు గురించి సోషల్ మీడియా వేదికగా అవగాహన కల్పిస్తున్నారు. ఆ సెల్ఫీ పాయింట్ మీద ఇలా రాసి ఉంది. 'మెరుగైన భవిష్యత్ కోసం ఓటు వేయండి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు నీ ఆయుధం. ఈ రోజు నేను నా ఓటు హక్కును వినియోగించుకున్నాను. మరి మీరు అని' రాసి ఉంది. సెల్ఫీ పాయింట్ అని కింద ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం, నియోజకవర్గం పేరు కూడా ఉంది. ఓటు హక్కు బాధ్యతను ఎన్నికల సంఘం సెల్ఫీ పాయింట్ ద్వారా తెలియజేసింది. సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయడం వల్ల జనాల నుంచి మంచి స్పందన లభిస్తోంది. గతంలో కన్నా ఓటింగ్ శాతం పెరుగుతోంది. ఈ విషయం పోలింగ్ శాతం చూస్తే అర్థమవుతోంది.



# ప్రశాంతంగా పోలింగ్

**మొదటిపేజీ తరువాయి..**

ఎన్నికల సంఘానికి అందాయి. రాష్ట్రంలో ఎక్కడా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాలేదని, రీ పోలింగ్ జరపాల్సిన అవసరం ఏర్పడలేదని ఎన్నికల అధికారులు తెలిపారు. రాష్ట్రంలో నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం రాలేదు.

### సీఈవో వికాస్‌రాజ్ పర్యవేక్షణ

లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా సోమవారం ఉదయం నుంచి బీఆర్‌కేఆర్ భవన్‌లో సీఈవో వికాస్‌రాజ్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ నిత్యం పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ద్వారా ఓటింగ్ తీరును పరిశీలిస్తూ, జిల్లా అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఓటింగ్ శాతం సమాచారాన్ని తెలుసుకోవడానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటుచేశారు.

# 4వ దశలో 67% ఓటింగ్

**మొదటిపేజీ తరువాయి..**

వినియోగించుకున్నారు. ఇక.. బిహార్‌లో 57.06%, ఝార్ఖండ్‌లో 65.2%, మధ్యప్రదేశ్‌లో 70.98%, మహారాష్ట్రలో 59.64%, ఒడిశాలో 73.97%, ఉత్తరప్రదేశ్‌లో 58.05% ఓటింగ్ నమోదైంది. సార్వత్రిక ఎన్నికల మొదటి మూడు దశల్లో వరుసగా 66.14%, 66.71%, 65.68% ఓటింగ్ నమోదైన సంగతి తెలిసిందే. కాగా.. ఇప్పటిదాకా జరిగిన నాలుగు దశల ఎన్నికలతో ప్రజల తీర్పు ఎన్డీయే కూటమికే అనుకూలంగా ఉన్నదన్న విషయం స్పష్టమైందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. దేశం నలుమూలలా ఎన్డీయే అభ్యర్థులకు మంచి మద్దతు లభిస్తోంది. ఇండియా కూటమి అసలు ప్రజల చర్చల్లోనే ఉండట్లేదని ఎద్దేవా చేశారు. శ్రీనగర్‌లో ?ప్రజలు ధైర్యంగా వచ్చి ఓటేశారంటూ మోదీ కొనియాడారు.

## వందరోజుల పాలనకు
# ఈ ఎన్నికలు రెఫరెండం


మొదటిపేజీ తరువాయి..

అడుగుతోంటే... మోదీ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందన్నారు. ఎవరు నామ్ దార్.. ఎవరు కామ్ దార్ దీన్నిబట్టి తెలుస్తోందన్నారు. ఎవరు అట్టడుగు వర్గాల ప్రజల కోసం పని చేస్తున్నారో చర్చకు సిద్ధమని అన్నారు. దేశంలో మోదీ వ్యతిరేక వేవ్ నడుస్తోందని.. మోదీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడినా చర్యలు లేవన్నారు. నవనీత్ కౌర్ 15 సెకన్ల కామెంట్స్‌పై చర్యలు లేవని మండిపడ్డారు. బీజేపీ నేతలపై ఎంహెచ్ఏ కంప్లైంట్ చేయదని ప్రశ్నించారు. కానీ ఒక వీడియో వైరల్ కేసులో తమపై ఎంహెచ్ఏ రంగంలోకి దిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్యాప్తు ఏజెన్సీలను బీజేపీ దుర్వినియోగం చేస్తుందనడానికి ఇది నిదర్శనమన్నారు. బీజేపీ వాషింగ్ మెషిన్‌లో చేరగానే కొందరు నాయకుల అవినీతి మరకలు తొలగిపోయా? అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ఆదాని, అంబానీ డబ్బులు ఇస్తున్నారన్న మోదీని ఒక్కటే అడుగుతున్నా.. ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులను పంపి ఆదానీ, అంబానీల ఆఫీసులపై, ఇళ్లల్లో సోదాలు నిర్వహించాలన్నారు. మోదీ ఆరోపణలు నిజమైతే ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని అడిగారు. రైతు బంధు ఎలా ఇచ్చామో.. పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ చేసి తీరుతామని మరోసారి స్పష్టం చేశారు. రుణమాఫీ ఏమీ అసాధ్యమైన టాస్క్ కాదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు తమ వంద రోజుల పాలనకు రెఫరెండమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతీసి పెట్టుబడులను గుజరాత్‌కు తరలించుకుపోవాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. యూపీ పరిస్థితిని తెలంగాణలో తీసుకురావాలని ప్రయత్నిస్తోందన్నారు. కేసీఆర్‌పై తనకు సానుభూతి ఉందన్నారు. మానసిక ఒత్తిడితో, నిరాశతో భావోద్వేగంతో ఆయన ప్రకటనలు చేస్తున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కూడా కేఏపాల్ లాగే మాట్లాడుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి సెటైర్ విసిరారు.

# నేడు వారణాసిలో ప్రధాని మోడీ నామినేషన్

**మొదటిపేజీ తరువాయి..**

ప్రయాణిస్తున్న వాహనం ముందు నడిచారు. మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, మహేశ్వరి, మార్వారీ, తమిళ, పంజాబీ తదితర భాషలకు చెందిన ప్రజలు 11 జోన్లలోని 100




పాయింట్ల వద్ద ప్రధాని మోడీకి ఘనస్వాగతం పలికారు. శంఖనాదాలు, డోలు, డమరుక వాయిద్యాల హోరుతో రోడ్‌షో మార్మోగిపోయింది. రోడ్‌షో మార్గం పొడవునా కాశీ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యక్తుల కటౌట్లను అమర్చారు. సంత్ రవిదాస్ గేట్, అస్సీ, శివాల, సోనార్‌పురా, జంగంబాడి, గోదౌలియా మీదుగా రోడ్‌షో కాశీ విశ్వనాథుని ఆలయం వరకు సాగింది. అనంతరం గంగానదిలో పుణ్య స్నానమాచరించిన మోడీ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం బిఎల్‌డబ్లు అతిథిగృహంలో ప్రధాని మోడీ రాత్రి బసచేశారు. కాశీ విశ్వనాథుని మందిరం నుంచి బయల్దేరిన ప్రధాని మోడీ కాన్వాయ్ మైదాగిన్ చౌరహా, కబీర్‌చౌర, లాహురబీర్ తేలియాబాగ్ తిరాహా, చౌకాఘాట్ చౌరాహా, లక్డీ మండి, కంటోన్మెంట్ ఓవర్‌బ్రిడ్జి, లహర్తరా, మండూవాదీ చౌరహా, కాకర్‌మట్ట ఓవర్‌బ్రిడ్జి ప్రాంతాల మీదుగా బిఎల్‌డబ్లు అతిథిగృహం చేరుకుంది.

# షేక్‌పేట్‌లో ఓట్ల గల్లంతుపై ఆందోళన

- జిల్లా ఎన్నికల అధికారికి ఓటర్ల ఫిర్యాదు
- పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కిషన్‌రెడ్డి

హైదరాబాద్, (నమస్తే ఉదయం):

షేక్ పేట్‌లో ఓట్లు గల్లంత్కైన పోలింగ్ కేంద్రాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పరిశీలించారు. షేక్ పేట్ డివిజన్‌లో దాదాపు 3 వేల ఓట్లను డిలీట్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనే వారంతా ఓటు వేశారు. అయితే ఇప్పుడు తొలగించారని చెబుతున్నారు. బీజేపీకి వ్యతిరే కంగా అధికారులు ఒక వర్గానికి చెందిన వారి ఓట్లను మాత్రమే తొలగించారని ఆరోపి స్తున్నారు. వారం కిందట ఓటరు స్లిప్పులను పంచారు. ఇప్పుడు జాబితాలో పేరు లేదం టూ వెనక్కి పంపారని తెలిపారు. అధికారులు




కావాలనే ఓట్లను తొలగించారని, దీనిపై ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేయనున్నామని వివరించారు.

# ప్రశాంతంగా తెలంగాణ పోలింగ్

**మొదటిపేజీ తరువాయి..**

సీ విజిల్ యాప్ ద్వారా వచ్చాయన్నారు. భారీ బందోబస్తుతో స్ట్రాంగ్‌రూమ్స్‌లో ఈవీఎంలను భద్రపరుస్తామన్నారు. ఈవీఎంలలో సమస్య వస్తే వెంటనే రీప్లేస్ చేశామని.. సాయంత్రం ఐదు గంటలకు వచ్చిన పోలింగ్ శాతం అంచనానే అంటూ సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. రాత్రి 7 గంటల తర్వాత కచ్చితమైన పోలింగ్ శాతం వస్తుందని.. మంగళవారమే పూర్తి పోలింగ్ శాతం వస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు 330 కోట్లు సీజ్ చేశామన్నారు. 44 కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయని.. జనరల్ అబ్జర్వర్స్ ఇచ్చే నివేదిక మేరకు ఎక్కడైనా రీపోలింగ్ అవసరమా లేదా నిర్ణయిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా పోలింగ్ కేంద్రాల్లో ప్రజల స్వచ్ఛందంగా ఓటు వేయడానికి వచ్చారన్నారు. ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో భారీ సంఖ్యలో క్యూలైన్లో ఓటర్లు ఉన్నారన్నారు. ఆదివారం మధ్యాహ్నం వర్షం కారణంగా పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరడానికి కొంత ఆలస్యమైందని తెలిపారు. వర్షం కురిసినప్పటికీ ఎక్కడా ఇబ్బంది లేకుండా పోలింగ్ సిబ్బంది సరైన సమయానికి పోలింగ్ను స్టార్ట్ చేశారన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి తమ ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఎక్కడైనా సమస్య ఉంటే 1950కి ఫిర్యాదు చేయాలన్నారు.ద

70 శాతం పోలింగ్ నమోదవుతుందని ఆశిస్తున్నట్లు సీఈవో వికాస్ రాజ్ పేర్కొన్నారు. కొన్ని చోట్ల వర్షాల వల్ల నిర్మల్,ఆదిలాబాద్,ఆసిఫాబాద్‌లో ఇబ్బందులు వచ్చాయన్నారు. 1-2 శాతం ఈవీఎంలు ఆలస్యంగా వెళ్లాయన్నారు. పరిస్థితి అంతా అదుపులోనే ఉందని తెలిపారు. తెల్లవారుజామున 5:30 గంటలకే మాక్ పోలింగ్ జరిగిందని.. 7 గంటలకు పోలింగ్ స్టార్ట్ అయిందని తెలిపారు. లా అండ్ ఆర్డర్ బాగుందన్నారు. ఈవీఎంలు కొన్ని చోట్ల మొరాయించాయన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీద ఫిర్యాదును చెక్ చేస్తామని సీఈవో వికాస్ రాజ్ వెల్లడించారు. తెలంగాణలో 17 లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ జరిగింది. అతి సమస్యాత్మక నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగియగా.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 5 గంటలకు ముగిసింది. అక్కడక్కడ చెదురు ముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. తెలంగాణలో 61.66 శాతం పోలింగ్ నమోదైంది. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్ సాయంత్రం 4 గంటలకే ముగిసింది. తెలంగాణ రాష్ట్రంలోని 5 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 13 అసెంబ్లీ సెగ్మెంట్లలో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన ఆసిఫాబాద్, సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, భద్రాచలం, పినపాక, ఇల్లందు, అశ్వరావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ముగిసింది.

# ఎవరి ధీమా వారిదే!

**మొదటిపేజీ తరువాయి..**

పనితీరుకు రెఫరెండమేనని పునరుద్ఘాటించారు. పది నుంచి 12 సీట్లు దక్కే అవకాశం ఉందని పార్టీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. ఖమ్మం, నల్లగొండ, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, ఆదిలాబాద్, పెద్దపల్లి, వరంగల్, మహబూబాబాద్, చేవెళ్ల సీట్లలో కాంగ్రెస్ కచ్చితంగా గెలుస్తుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. హైదరాబాద్‌ను వదిలేస్తే... సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, మల్కాజ్‌గిరీ సీట్లలో ప్రత్యర్థి పార్టీలతో గట్టి పోటీని ఎదుర్కొంటున్నట్లు వివరిస్తున్నాయి. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరీ సీట్లలో ఓటర్లు సహజంగా అధికార పార్టీకి మెగ్గు చూపుతారని, ముస్లిం మైనార్టీలూ కాంగ్రెస్ అభ్యర్థులకే మద్దతుగా నిలిచిన నేపథ్యంలో రెండూ తమకే దక్కుతాయని అంచనా వేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనితీరు పట్ల ఉన్నసానుకూలత, బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందన్న ప్రచారాలకు తోడు రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం మైనార్టీల్లో మెజారిటీ ఓటర్లు కాంగ్రెసకు మద్దతుగా నిలవడడంతో కాంగ్రెసకు సానుకూల పరిస్థితి స్పష్టంగా కనిపించిందని పార్టీ నేతలు చెబుతున్నారు.

### గ్రామీణ ప్రాంతాల్లోనూ మోదీ క్రేజ్

రాష్ట్రంలో మెజారిటీ ఎంపీ స్థానాలు తామే సాధించబోతున్నామని కమలనాథులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం పెరుగుతోందని, ఇది తమకు అనుకూలిస్తుందని అంటున్నారు. ఓటుబ్యాంకు భారీగా పెరుగుతోందని, 9–10 సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు. "పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తగ్గినా బీజేపీకిఆదరణ పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ మోదీ క్రేజ్ విస్పష్టంగా కనిపించింది" అని బీజేపీ సీనియర్ నేత ఒకరు విశ్లేషించారు. ఒక ప్రధాన కులం ఈసారి పూర్తిగా తమ ప్రత్యర్థి వైపు మొగ్గు చూపినట్లు సమాచారం అందిందని, అయితే, దీని ప్రభావం పెద్దగా ఉండబోదని చెప్పారు. యువత పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారని, మోదీ రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడం కలిసి వచ్చిందని చెబుతున్నాయి. ప్రధానిగా మోదీ మరోసారి కొనసాగాల్సిన అవసరాన్ని ప్రచారం చేశామని, యువత కూడా అనుకూలంగా స్పందించిందని తెలిపాయి.

### ఓటింగ్ శాతం తగ్గదు: బీఆర్ఎస్

కనీసం ఆరు స్థానాల్లో గెలుపు తథ్యమని బీఆర్ఎస్ భావిస్తోంది. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ వైఫల్యాలు, కేంద్రంలో బీజేపీ తెలంగాణకు ఏమీ చేయడం లేదన్న అంశాలే ప్రధాన ఎజెండాగా బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించింది. మెదక్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, కరీంనగర్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి లోకసభ స్థానాల్లో గెలుస్తామని భావిస్తున్నట్లు తెలిసింది. ఓటింగ్ శాతం ఏ మాత్రం తగ్గదని అంచనా వేస్తున్నారు. మెదక్ ఏళ్ల తరబడి కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్న స్థానమని, అక్కడ గెలుపు తేలికేనని, మల్కాజిగిరి, సికింద్రాబాద్ పరిధిలో పార్టీ ఎమ్మెల్యేలు ఉండటం, సికింద్రాబాద్‌లో పార్టీ అభ్యర్థికి ప్రజల్లో ఎక్కువ ఆదరణ లభించడం కలిసివస్తాయని అంచనా వేస్తున్నారు.

### బీఆర్ఎస్ నుంచి క్రాస్ ఓటింగ్

పోలింగ్ తేదీ నాటికి రాష్ట్రంలోని మెజారిటీ లోక్‌సభ సీట్లలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యనే ముఖాముఖీ పోటీ నెలకొన్నట్లుగా వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో ఆయా స్థానాల్లో బీఆర్ఎస్ ఓట్లు భారీగా క్రాస్ అయినట్లు చెబుతున్నారు. ఒకటి, రెండు శాతం ఓట్లే గెలుపోటములను నిర్ణయిస్తున్న క్రమంలో క్రాస్ అయిన బీఆర్ఎస్ పార్టీ ఓట్లు.. ఎవరి కొంప ముంచుతాయోనన్న ఆందోళన ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ వర్గాల్లోనూ నెలకొంది. ముఖ్యంగా మల్కాజ్‌గిరీ, చేవెళ్ల, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు, జహీరాబాద్, నిజామాబాద్ వంటి చోట్ల క్రాస్ ఓటింగ్ భారీగా జరిగిందని చెబుతున్నారు. బీఆర్ఎసలోని కాంగ్రెస్ వ్యతిరేకులు బీజేపీ వైపు, బీజేపీ వ్యతిరేకులు కాంగ్రెస్ పార్టీకి క్రాస్ చేసినట్లూ వార్తలు వస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు మరో ఐదేళ్ల సమయం ఉన్న నేపథ్యంలో అధికార పార్టీతో మంచి కోసమూ కొందరు బీఆర్ఎస్ నేతలు.. కాంగ్రెస్ అభ్యర్థులకు క్రాస్ చేయడానికే మెగ్గు చూపినట్లూ చెబుతున్నారు. పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులకు ఉన్న వ్యక్తిగత పరిచయాలతోనూ క్రాస్ ఓటింగ్ జరిగిందంటున్నారు. చేవెళ్ల నియోజకవర్గం తీసుకుంటే ఇటు కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, అటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలు ఇద్దరూ గతంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీలుగా పనిచేసిన వారే. ఆ పార్టీ నాయకులతో ఇద్దరికీ వ్యక్తిగత పరిచయాలు, ప్రయోజనాలు ఉన్నాయి. దీంతో ఎవరికి వీలైనంతగా వారు బీఆర్ఎస్ ఓటింగ్‌ను తమవైపునకు తిప్పుకున్నట్లు చెబుతున్నారు.

### బీఆర్ఎసకు భారీ దెబ్బ

ముక్కోణపు పోటీలు జరిగితే మెజారిటీ సీట్లలో రెండో ప్లేసు దక్కించుకునైనా ఉనికి నిలబెట్టుకోవాలని భావించిన బీఆర్ఎస్ నాయకత్వం ఆశలకు.. ఈ క్రాస్ ఓటింగ్ భారీగా గండి కొట్టినట్లు చెబుతున్నారు. మెజారిటీ సీట్లలో బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోనున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉనికే ప్రమాదంలో పడేందుకూ ఆస్కారం ఉన్నట్లు చెబుతున్నాయి.

# బీఆర్ఎస్ ఎక్కువ సీట్లు సాధించబోతోంది

- ఏపీలో జగన్‌కు మంచి ఫలితాలు
- కరెంట్ కోతలపై కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు
- మోదీ రాజ ధర్మం లేదు..అంతా వివక్షే
- మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, (నమస్తే ఉదయం):

నందినగర్‌లోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాలులో మాజీ మంత్రి కేటీఆర్ తన కుటుంబంతో ఓటు హక్కు వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇంతకంటే అనేక సవాళ్లతో కూడుకున్న ఎన్నికలలో విజయం సాధిం చామని, అప్పటి కన్నా సీట్లు ఎక్కువ సాధిస్తామన్న నమ్మకం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి నాకు సోదరుడి లాంటి వాడు. ఈ ఎన్నికల్లో ఆయన మంచి ఫలితాలు సాధిస్తారన్న నమ్మకం ఉందని వ్యాఖ్యా నించారు. పోలింగ్ స్టేషన్లలో కరెంటు పోకుండా జనరేటర్లు పెట్టి ముగ్గురు అధికారులతో తెలంగాణ ప్రభుత్వం



కష్టపడుతుంది. ఆరు గ్యారంటీలలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఒక గ్యారంటీని సగం సగం అమలు చేసింది. ఇప్పటికైనా ఆయన ముఖ్యమంత్రి అని గుర్తించుకోవాలి. కరెంటు కోతలు, నీటి కొరత, సమస్యలపై దృష్టిపెట్టాలి. నరేంద్ర మోడీ శ్రీరామచంద్ర ప్రభువుకు చెప్పినట్టు రాజు ధర్మాన్ని పాటించాలి. అన్ని రాష్ట్రాల మధ్యన ఎలాంటి వివక్ష లేకుండా నిధులను కేటాయించడం లేదా ప్రాజెక్టులు కేటాయించడం చేయలేదు. భారతదేశం మొత్తం ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. పదేళ్లుగా మోదీ ప్రజలను మోసం చేస్తుంటే.. వందరోజుల నుంచి ఇక్కడ రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నా రు. ఈరోజు కరెంటు కోతలపై కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇచ్చినట్టుగా ఉంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇన్వర్టర్లు, జనరేటర్లు, క్యాండిల్స్, పవర్ బ్యాంకులు, చార్జింగ్ లైట్, ఇవే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలని ఎద్దేవా చేశారు. తెలంగాణ తెచ్చిన నాయకుడు కేసీఆర్. తెలంగాణ కోసం తెలంగాణ భవిష్యత్తు కోసం నేను ఓటు వేశాను అని స్పష్టం చేశారు.




# ఓటేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

మధిర,(నమస్తే ఉదయం):

మధిరలోని సుందరయ్యనగర్ ప్రాథమిక పాఠశాలలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ విని యోగించుకుని ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని తెచ్చుకోవడం మన బాధ్యత అని తెలిపారు.

ఓటు హక్కును వినియో గించుకునే అవకాశం కోల్పోతే ప్రజాస్వామ్య పునాదులను, లౌకికవాదాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకుని దేశ ప్రజాస్వా మ్యాన్ని, రాజ్యాంగాన్ని, మన సంపద, వనరులు, వ్యవస్థలు, ఆస్తులను కాపాడుకునేందు కు ఓటు హక్కును ఒక ఆయుధంగా వాడుకోవాలని పిలుపునిచ్చారు.



# తెలంగాణలో బీజేపీకి సంపూర్ణ మద్దతు

- వచ్చే ఫలితాల్లో సరికొత్త శక్తిగా అవతరణ
- సికింద్రాబాద్‌లో విజయం నాదే
- రేవంత్ స్థాయి తెలుసుకుని మాట్లాడాలి
- మజ్లిస్ కార్యకర్తల్లా కాంగ్రెస్ శ్రేణులు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలపై కార్యక్రమాలు
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, (నమస్తే ఉదయం):

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడం సంతో షంగా ఉంది. ఓట్లేసిన తెలంగాణ ప్రజానీకానికి కృతజ్ఞతలు. 65 శాతానికి మించి పోలింగ్ శాతం జరిగే అవకాశాలు ఉన్నాయి. 2019 ఎన్నికల కంటే అత్యధికంగా పోలింగ్ శాతం పెరిగింది. గ్రామీణ ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు బీజేపీకి లభించింది. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తగ్గినా మద్దతు మాకే ఉందని అనుకుంటున్నాం. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు రెచ్చగొట్టినా మా కార్యకర్తలు సంయమనం పాటించా రు. రాజకీయ ప్రత్యర్థులే తప్ప మాకు శత్రువులు లేరు. డబుల్ డిజిట్ స్థానాలతో తెలంగాణలో బీజేపీ ఒక కొత్త శక్తిగా నిలవబోతోంది. పసుపు బోర్డు, సమ్మక్క సారక్క యూనివర్సిటీ, కృష్ణా బోర్డు వంటి హామీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తాం. బీఆర్ఎస్ వైఫల్యాలు, కాంగ్రెస్ గ్యారంటీలపై రెండంచల కార్యక్రమాలకు సిద్ధమవుతాం. రేవంత్ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు.

రేవంత్ మాటలను ప్రజలే కాదు..వారి పార్టీ నాయకులే పట్టించు కోలేదు. ఎవరి స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడితే బావుం టుంది. ఎవరు ఏంటనేది జూన్ 4న తెలుస్తుంది. సికింద్రాబాద్‌లో తప్పకుండా గెలుస్తు న్నా. అక్కడక్కడా అధికారులు కొంతమందితో కుమ్మక్కై ఓటర్లను ఇబ్బందులకు గురి చేశా రు. అర్బన్ ఏరియాలో ఉన్న ఓటర్ లిస్టును పూర్తిస్థాయిలో సంస్కరించాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా దిగజారిపోయింది. రాహుల్ గాంధీ ప్రదాని అయ్యే అవకాశాలు లేవు. కాబట్టి పెళ్లి చేసుకుందామని డిసైడ్ అయ్యారు. పెళ్లి చేసుకోవడం తప్పు కాదు. ఆయన ఉన్నంతవరకు బీజేపీకి ఢోకా లేదు. ఏడు అసెంబ్లీలలో పర్యటించి నప్పుడు మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్ పూర్తిస్థాయిలో సహకరించింది. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించకుండా మజ్లిస్ కార్యకర్తల్లా వ్యవహరించారు.



శాస్త్రిపురం సెయింట్ ఫయాజ్ హై స్కూల్‌లోని 401 పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తున్న మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ




కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసినట్లు చూపుతున్న అసదుద్దీన్ ఒవైసీ



మైలార్ దేవ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల 377 పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



బీజేపీ పార్టీ నాయకులతో కలిసి ఓటు వేశానని చూపుతున్న మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

# చేవెళ్ల పార్లమెంట్‌లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్..

## సాయంత్రం 5 గంటల వరకు 53.15 శాతం నమోదు - పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం.. - పోలింగ్‌పై రిటర్నింగ్ అధికారి ప్రత్యేక మానిటరింగ్

**రాజేంద్రనగర్,మే 13 (నమస్తే ఉదయం):**

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం వ్యాప్తంగా చదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ముగిసింది.ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు ప్రశాంతంగా కొనసాగింది.పలు పోలింగ్ కేంద్రాల్లో 6 గంటలలోపు క్యూలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు.చేవెళ్ల పార్లమెంట్ వ్యాప్తంగా ఓటరు చైతన్యం వెల్లివిరిసింది.ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు.గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలలోనూ ఉత్సాహంగా ప్రజలు ఓటింగ్ లో పాల్గొన్నారు.

సాయంత్రం 5 గంటల వరకు 53.15 శాతం పోలింగ్ నమోదైంది.65 శాతం దాకా పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉంది.పోలింగ్‌కు ముందు పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది మాక్ పోలింగ్ నిర్వహించారు.

అనంతరం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.రాజేంద్రనగర్ సర్కిల్ కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైంది.ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసిన యువతీయువకులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపించారు..ఉదయం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్..సాయంత్రం ఒక్కసారిగా ఊపందుకుంది.

పలు చోట్ల చివరి నిమిషంలో పోలింగ్ కేంద్రాల ముందు ఓటర్లు బారులు తీరారు.అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.అయితే పోలింగ్ శాతంపై మాత్రం ఇంకా ఉత్కంఠ నెలకొంది.అంతే కాకుండా పోలింగ్ కేంద్రానికి పలువురు కేవలం ఓటర్ స్లిప్ లతో రావడంతో ఏదేని గుర్తింపు కార్డు అడగడంతో వెనుదిరిగి వెళ్లి ఐడీ కార్డు తీసుకువచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఈ ఎన్నికల్లో మొత్తం 43 మంది అభ్యర్థులు బరిలోకి దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో రాజకీయ నేతలు,అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.జూన్ 4న ఎన్నికల ఫలితాలు చేవెళ్ల నియోజకవర్గంలోని బండారు శ్రీనివాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో వెలువడనున్నాయి.

### పోలింగ్ సరళి ఇలా..

ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సరళి వివరాలు...9 గంటల వరకు సుమారుగా 10.28 శాతం పోలింగ్ నమోదు కాగా,11 గంటల వరకు 20.35 శాతం,మధ్యాహ్నం ఒంటిగంట వరకు సుమారు 34.56 శాతం పోలింగ్ నమోదయింది. మధ్యాహ్నం 3 గంటల వరకు 45.35 శాతం మేర పోలింగ్ నమోదవ్వగా...సాయంత్రం ఐదు గంటల వరకు 53.15 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.మరో గంట టైం ఉండడంతో 60 శాతం వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉంది.

### ఎన్నికల ప్రక్రియపై రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ శశాంక ప్రత్యేక మానిటరింగ్...

చేవెళ్ళ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఎన్నికల ప్రక్రియపై రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ శశాంక ప్రత్యేకంగా మానిటరింగ్ చేశారు.సోమవారం రాజేంద్రనగర్ లోని నార్మ్ గెస్ట్ హౌస్ నుంచే ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా మానిటరింగ్ చేశారు.తన దృష్టికి వచ్చే అంశాలపై అధికారులను అప్రమత్తం చేస్తూ పలు సూచనలు చేశారు.సోమవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.నియోజక వర్గం మొత్తంగా పోలింగ్ ప్రక్రియ సాఫీగా సాగింది..



శివరాంపల్లి దళిత బస్తీలో భర్త పి జయప్రకాష్‌తో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పి అర్చన



హైదర్‌గూడలో ఓటు వేసిన అత్తాపూర్ కార్పొరేటర్ ఎం. సంగీత గౌరీ శంకర్



కోకాపేట్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నపిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి దంపతులు



ఓటు హక్కు వినియోగించుకున్న బి ఆర్ ఎస్ నాయకుడు టి రఘు గౌడ్ కుటుంబ సభ్యులు



రాజేంద్ర నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకున్న రాజేంద్రనగర్ వడ్డెర సంఘం ప్రతినిధులు




హైదర్‌గూడ పోలింగ్ కేంద్రం వద్ద ప్రణవభక్తం సమాజం ప్రతినిధులు



కుటుంబ సభ్యులతో ఓటు వేసిన జలమండలి ఉద్యోగ సంఘం నాయకుడు అఖిలేష్ కుటుంబ సభ్యులు

బండ్ల గుడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్





హైదర్ గూడ పోలింగ్ కేంద్రం లో ఓటు వేసిన ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం నరసింహ మాదిగ కుటుంబ సభ్యులు



ఓటు వేసి సిరా చూపుతున్న బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి సత్యనారాయణ ముదిరాజ్ సతీమణి సంధ్యారాణిలు



బుద్వేల్‌లో ఓటు వేసిన బిజెపి దళిత మోర్చా రాష్ట్ర నాయకులు కోరని సదానందం, స్థానిక నాయకులు



ఓటు వేసి సిరా చూపుతున్న హైదర్ గూడ అఖిలపక్ష పార్టీ నాయకులు



## ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి,ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, తనయులు

**రాజేంద్రనగర్,మే13(నమస్తే ఉదయం):** మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి కుటుంబ సమేతంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం చేవెళ్ల మండల కౌకుంట్లలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.కుటుంబ సభ్యులతో కలిసి పి.సబితా ఇంద్రారెడ్డి పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు.అనంతరం పోలింగ్ బూత్ నుంచి బయటికి వచ్చి సిరా గుర్తును చూపించారు.ఓటు వేసిన వారిలో సబితా ఇంద్రారెడ్డి తనయుడు పి.కార్తీక్ రెడ్డి, పి.కౌశిక్ రెడ్డి,పి.కళ్యాణ్ రెడ్డి,కోడలు ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు.



ఓటు హక్కు వినియోగించుకొని సిరా జుపుతున్న గద్వాల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బండ్ల లక్ష్మీదేవి చంద్రశేఖర్ రెడ్డి

## లక్షల మెజారిటీతో గెలుస్తాం

- డీకే అరుణమ్మ.

**మక్తల్, మే 13(నమస్తే ఉదయం):** మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గం నుండి మూడు లక్షల ఓట్లతో విజయం సాధిస్తామని అభ్యర్థి డీకే అరుణమ్మ అన్నారు. సోమవారం మక్తల్ పట్టణంలో పోలింగ్ ముగిసే సమయాన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అనంతరం డీకే అరుణ మాట్లాడుతూ.. మహిళా అని




మీడియాతో మాట్లాడుతున్న పాలమూరు ఎంపీ బిజెపి అభ్యర్థి డీకే అరుణ

చూడకుండా వ్యక్తిగత విషయాలతో దూషించడం రాత్రికి రాత్రి ఓటుకి నోట్లు మద్యం పారబోసిన చేసి పోసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు గెలుపు కనుచూపు మెదలో కనిపించడం లేదని ఆమె అన్నారు. గత పది సంవత్సరాలలో ప్రధానమంత్రిగా మోడీ చేసిన పాలనకు దేశంలోని ఆయనను మూడోసారి ప్రధానమంత్రిగా చూడాలన్న తపనతో దేశ ప్రజలు ఉన్నారని, అందులో భాగంగానే తెలంగాణలో మెజార్టీ సీట్లను గెలుచుకుంటామని ఆమె అన్నారు. రాష్ట్ర బిజెపి కార్యాలయం సభ్యుడు కొండయ్య. కర్నిస్వామి. రాజశేఖర్ రెడ్డి. కల్లూరి నాగప్ప. పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## కోకాపేట్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న పిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి దంపతులు

**రాజేంద్రనగర్,మే13(నమస్తే ఉదయం):** పిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి దంపతులు పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.కోకాపేట్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన



పోలింగ్ బూత్ నంబర్ 07 లో తన భార్యతో కలిసి ఓటు వేశారు.అనంతరం పోలింగ్ బూత్ నుంచి బయటికి వచ్చి సిరా గుర్తును చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని తెలిపారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని, ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.




ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్



ఓటు హక్కు వినియోగించుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల జ్యోతి, కృష్ణ మోహన్ రెడ్డి దంపతులు



తమ స్వగ్రామం జల్లాపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న గద్వాల జిల్లా పరిషత్ చైర్మన్ సరిత తిరుపతయ్య, కుటుంబ సభ్యులు




# జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 13(నమస్తే ఉదయం)** నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ సోమవారం సాయంత్రం 5గంటల వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. సాయంత్రం ఐదు గంటల వరకు గద్వాల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 74.93%, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 73.11% పోలింగ్ జరిగినట్లు చెప్పారు. సాయంత్రం 6 గంటలలోపు పోలింగ్ కేంద్రం క్యూ లైన్ లో ఉన్నవారందరికీ ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం ఉన్నందున పోలింగ్ శాతం మరికొంత పెరిగే అవకాశం ఉందన్నారు. పోలింగ్ కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉదయం నుంచి తమ విధులను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



ఓటు హక్కు వినియోగించుకున్న బిజెపి నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు



ఓటు హక్కు వినియోగించుకున్న గద్వాల మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్



ఓటు హక్కు వినియోగించుకున్న నాగర్ కర్నూల్ టిఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



## ఎన్నికల నిబంధన ఉల్లంఘించిన రేవంత్ రెడ్డి

### అతనిపై చర్యలకు ఇసికి రఘునందన్ ఫిర్యాదు

**దుబ్బాక,మే13((నమస్తే ఉదయం):** 2 సీఎం రేవంత్ రెడ్డి లోక్ సభ ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. ఓటేసేందుకు వెళ్లి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి రాజకీయాల గురించి మాట్లాడారని ఆయన విమర్శించారు. దేశ ప్రధాని, బీజేపీ పార్టీ గురించి ఎలా మాట్లాడుతారని రఘునందన్ రావు ప్రశ్నించారు.ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేశామన్నారు. ఆయనను సాయంత్రం వరకు గృహ నిర్బంధంలో ఉంచాలని, ఆయన్ని మాట్లాడనియకుండా ఆదేశాలు ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు చెప్పారు. ఎన్నికలు ముగిసి ఫలితాల తర్వాత సీఎం మాట్లాడితే బాగుంటుందన్నారు. తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్ సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆ భయంతోనే తన స్థానానికి ఎక్కడ ఇబ్బంది వస్తోందోనన్న అనుమానంతో ఓటర్లను ప్రలోభపెట్టేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



# చేవెళ్ల పార్లమెంటు పరిధిలో ప్రశాంతంగా పోలింగ్

**రాజేంద్ర నగర్, మే13 (నమస్తే ఉదయం):** చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో సోమవారం నిర్ణీత సమయానికి అన్ని పోలింగ్ బూత్ లలో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 7.00 గంటలకు ముందే అనేక మంది ఓటర్లు పోలింగ్ బూత్ ల వద్దకు తరలి వచ్చి, క్యూ లైన్ లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ళ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక సైతం ఉదయం వేళలోనే తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం పరిది లోని తెలంగాణ స్టేట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు.

### ఎన్నికల ప్రక్రియపై రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ శశాంక ప్రత్యేక మానిటరింగ్ :

చేవెళ్ళ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఎన్నికల ప్రక్రియ పై రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ శశాంక ప్రత్యేకంగా మానిటరింగ్ చేశారు. రాజేందర్ నగర్ లోని నార్మ్ గెస్ట్ హౌస్ నుంచే ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా మానిటరింగ్ చేశారు. తన దృష్టికి వచ్చే అంశాలపై అధికారులను అప్రమత్తం చేస్తూ పలు సూచనలు చేశారు.

సోమవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఊదయం 9 గంటలకు వరకు 10.28శాతం, 11 గంటల వరకు 20.35 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 34.56 శాతం, మూడు గంటల వరకు 45.35 శాతం పోలింగ్ నమోదయింది. సాయంత్రం 5.00 గంటల వరకు 53.15 శాతం పోలింగ్ నమోదయింది.

ఓటు వేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. గంట గంటకు పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. చేవేళ్ళ పార్లమెంటు నియోజక వర్గం మొత్తంగా పోలింగ్ ప్రక్రియ సాఫీగా జరిగింది.




**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.